## క్లుప్తంగా

### ఓఆర్ఎస్ ప్రాధాన్యతపై ప్రచారం



పడమర ఖంద్రికలో ఓఆర్ఎస్ ద్రావకం ప్రాధాన్యతను వివరిస్తున్న బేబి

**కపిలేశ్వరపురం:** మండల గ్రామాల్లో సోమవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్రాధాన్యతపై ప్రచారం నిర్వహించారు. అంగర పీహెచ్‌సీ పరిధిలోని పడమర ఖంద్రికలో వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్రయోజనాలను వివరించారు. ఎండ వేడి నుంచి రక్షించుకునేందుకు శరీరంలో తగిన లవణాలు ఉండాలని, రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్లు నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య కార్యకర్త సీహెచ్ బేబీ తదితరలు పాల్గొన్నారు.

### స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



స్పందన అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం

**రామచంద్రపురం:** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఆర్డీఓ పి.సింధు సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ మేరకు స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా అర్జీదారులకు పూర్తి సంతృప్తి కలిగే విధంగా పరిష్కరించడానికి కృషి చేయాలని డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం 5 అర్జీలు రాగా వీటిలో భూ సమస్యకు సంబంధించి రెవెన్యూ శాఖ, సర్వే శాఖ, పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ, గనులు, భూగర్భజలాల శాఖలకు చెందిన ఒక్కో అర్జీ ఉన్నాయని తెలిపారు.

### జగనన్న ఆశయ సాధనకు కృషి



కుయ్యేరు సర్పంచ్, పాలకవర్గం సభ్యులను సత్కరిస్తున్న స్థానికులు, గ్రామస్తులు

**కాజులూరు:** సీఎం జగనన్న ఆశయ సాధనకు అనుగుణంగా గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అన్నారు. పంచాయతీ పాలకవర్గం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కుయ్యేరు గ్రామ సచివాలయంలో సోమవారం సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సమావేశమై వార్షికోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ఎన్నడూ లేనంతమంది సిబ్బందిని నియమించారన్నారు. పంచాయతీలకు ప్రత్యేక అధికారాలు బదలాయించారన్నారు. ప్రభుత్వ సహకారాలను సద్వినియోగం చేస్తూ గ్రామాబివృద్ధికి పాటుపడతామన్నారు. అనంతరం సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, పాలకవర్గం సభ్యులను పలువురు స్థానికులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు.

### మసీదు స్థలం సర్వే

**మండపేట:** పట్టణంలోని జామీయ మసీదు స్థలాన్ని ఆక్రమించి పక్కనే నిర్మాణం చేపట్టారని ముస్లిం పెద్దల ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం రెవెన్యూ సర్వేయర్లు డిజిటల్ సర్వే నిర్వహించారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు సర్వేయర్ల బృందం మసీదుకు సంబంధించిన స్థలాన్ని సర్వే చేశారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేయనున్నట్టు వారు తెలిపారు.

### టిడ్కో పనులు వేగవంతం చేయాలి

**మండపేట:** టిడ్కో ప్లాట్ల వద్ద మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. టీడీపీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి సోమవారం ఆయన టిడ్కో ప్లాట్లను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పనుల్లో జరుగుతున్న జాప్యంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

### పేకాడుతున్న నలుగురి అరెస్ట్

**మండపేట:** మారేడుబాకలో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలో సోమవారం పేకాటాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఎం.అశోక్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు, రూ. 2840 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

# సేంద్రియ సాగు.. లాభాలు బాగు..

- ఆశాజనకంగా సేంద్రియ వరి పంట
- ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి
- రూ.వెయ్యి వరకూ అదనపు ఆదాయం
- ఆరోగ్యానికి మేలంటున్న వ్యవసాయాధికారులు

సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వరి ఆశాజనకంగా పండింది. ఎకరాకు 40 బస్తాల వరకూ దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రసాయనాలు వినియోగించి పండించిన పంటతో పోలిస్తే సేంద్రియ ధాన్యానికి బస్తాకు రూ.750 నుంచి రూ.1000 వరకూ అదనపు ఆదాయం లభిస్తుందని వ్యవసాయాధికారులు అంటున్నారు.



అర్తమూరులో సేంద్రియ వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట, విజయభాస్కరరెడ్డి తదితరులు

**మండపేట:** అధిక దిగుబడే లక్ష్యంగా వరిసాగులో ఎరువులు, పురుగు మందుల వాడకం పెరిగిపోయింది. అవసరానికి మించి క్రిమి సంహారక మందుల వినియోగం వల్ల పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు చేరి ఆరోగ్యానికి చేటు చేస్తున్నాయి. రైతులకు మేలు చేయడంతో పాటు ఆరోగ్యకరమైన సమాజం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పురుగుమందుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు, బయో పెస్టిసైడ్స్ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. మరో పక్క కోవిడ్ అనంతరం ఆరోగ్యంపై ప్రజల్లో శ్రద్ధ పెరిగింది. ప్రభుత్వ తోడ్పాటు, రసాయనాలు లేని పంట ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండడం రైతులను సేంద్రియ సాగు వైపు అడుగులు వేయిస్తోంది.

**దాళ్వాలో 150 ఎకరాల్లో..**

ప్రస్తుత దాళ్వా సీజన్‌లో మండపేట నియోజకవర్గంలో దాదాపు 150 ఎకరాల్లో రైతులు వివిధ వరి వంగడాలను సేంద్రియ తరహాలో సాగు చేసినట్టు అంచనా. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ఏ విధమైన రసాయనాలు, ఎరువులు వాడకుండా పూర్తిగా కషాయాలు, సేంద్రియ ఎరువులతో సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో ఎక్కడికక్కడ పొలాలు ఆశాజనకంగా పండడం రైతుల్లో ఆనందం నింపుతోంది. సాధారణ పద్ధతిలో ఎరువులు, పురుగు మందులు వినియోగించిన పొలాల్లో ఎకరాకు 45 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా. కాగా సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పొలాల్లోను 40 బస్తాలు వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. సాధారణ పద్ధతిలో పండించిన 75 కేజీల బస్తా రూ.1530లు ఉంటే సేంద్రియ విధానంలోని బస్తా రూ.2500 వరకు ఉంటుందని తెలిపారు. రైతుకు అదనపు ఆదాయంతో పాటు రసాయన అవశేషాలు లేని ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులు పండివచ్చునని సూచిస్తున్నారు.

**రైతులను అభినందించిన ఎమ్మెల్సీ**

మండలంలోని అర్తమూరులో 4.5 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన తెలంగాణా సోనా వరి పంటను గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో వరిని ఆశాజనకంగా పండించిన రైతులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం సేంద్రియ, ప్రాకృతిక విధానాల్లో సాగును ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు.

**ఆశాజనకంగా దిగుబడి**



కొన్నేళ్లుగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నాను. పంట ఆశాజనకంగా పండింది. ఆరోగ్యవంతమైన పంట పండిస్తున్నామన్న ఆనందం ఉంది. మామూలు ధాన్యం ధర కంటే సేంద్రియ పంటకు అధిక ధర పలుకుతోంది.

–పేపర్తి సత్యనారాయణ (సాంబు), రైతు, మండపేట

**ఆరోగ్యానికి మేలు**



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంట ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. సేంద్రియ, ప్రకృతి విధానాల్లో సాగు చేపట్టేలా వ్యవసాయశాఖ రైతులను చైతన్యవంతం చేస్తోంది.

– కె.ఏసుబాబు, మండల వ్యవసాయాధికారి, మండపేట

### వైభవంగా లక్ష్మీనారాయణుని కల్యాణం



వెలంపాలెం లక్ష్మీనారాయణుని కల్యాణం

**రామచంద్రపురం రూరల్:** దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి పాలక క్షేత్ర పరిధిలోని 12 గుండాలలో ఒకటైన బ్రహ్మ గుండం వద్ద వేంచేసిన భీమేశ్వరాలయ క్షేత్రపాలకుడు లక్ష్మీ సమేత నారాయణస్వామి దివ్య కల్యాణం ఆదివారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. గ్రామోత్సవం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ అనంతరం స్వామి కల్యాణ క్రతువును అంగర ప్రభాకరాచార్యులు, బృందావనం సత్యనారాయణాచార్యులు, సంపర గోపాలాచార్యులు, అంగర లక్ష్మీనారాయణాచార్యులు బ్రహ్మత్వాన శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం స్వామి కల్యాణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల నుంచి భీమేశ్వరాలయానికి తీసుకుని వెళ్లి మళ్లీ గ్రామానికి రథోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టరు, సర్పంచ్ టేకుమూడి సుజాత, సత్యనారాయణ దంపతులు, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, సూరిబాబు దంపతులు, పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి ధ్యేయంగా పాలన

**మండపేట:** గ్రామాభివృద్ధే ధ్యేయంగా పాలన అందిస్తున్నామని సర్పంచ్ అన్నపూర్ణ అన్నారు. పంచాయతీ పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా అర్తమూరు పంచాయతీలో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని అర్తమూరు గ్రామాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తున్నామన్నారు. రెండేళ్లలో రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టామని వివరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులను పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత, ఈఓ భీమేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు గొలుగూరి సందీప్‌రెడ్డి, చిర్ల జయరామ్‌రెడ్డి, కొవ్వూరి సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరి గంగిరెడ్డి, తేతలి హరినాథరెడ్డి, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

## పంచాయతీ పాలకవర్గాల సంబరాలు

**రామచంద్రపురం రూరల్:** పంచాయతీ సర్పంచ్‌లుగా, పాలకవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వెల్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్ ఆధ్వర్యంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, పాలకవర్గ సభ్యులు కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు, జగన్నాయకులపాలెం సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణను గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వలంటీర్లు, గ్రామస్తులు దుశ్శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. హసన్‌బాదలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ భాస్కరలక్ష్మి ఆధ్వర్యంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, పాలకవర్గ సభ్యులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.



జగన్నాయకులపాలెంలో అనిశెట్టి రామకృష్ణను సత్కరిస్తున్న గ్రామస్తులు

## ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

**తొలిరోజు నలుగురు విద్యార్థులు గైర్హాజరు**

**మండపేట:** పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండపేట పట్టణ, మండలం నుంచి 1,838 మంది విద్యార్థుల కోసం తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండపేట అర్బన్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్‌ఆన్స్ స్కూల్, ప్రభుత్వ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, మండలంలో ఏడిద, ద్వారపూడి హైస్కూళ్లు, తాపేశ్వరంలోని శ్రీచైతన్య స్కూల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి ఆయా పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం కనిపించింది. సెంటర్ల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రాలు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిరోజు నలుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్టు ఎంఈఓ ఎస్.రామచంద్రరావు తెలిపారు.

**నూరుశాతం విద్యార్థులు హాజరు**

**కపిలేశ్వరపురం:** అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు, కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకటి మొత్తం మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రాంభమయ్యాయి. ఆయా కేంద్రాల్లో చీఫ్ సూపరింటిండెంట్లుగా సీహెచ్‌వీవీఎస్ఎన్ మూర్తి, వై.నాగేశ్వరరావు, వి.శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా పి.వాసంతి, ఎస్.శ్రీనివాస్, ఎస్.సూర్యనారాయణలు వ్యవహరించారు. ఎంఈఓ కె.తాతారావు, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై జి.చంటి పర్యవేక్షణలోని అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మూడు కేంద్రాల్లో 560 మంది పరీక్షలకు హాజరుకావడంతో నూరుశాతం నమోదైంది.

**టెన్షన్ లేకుండా 'టెన్త్' పరీక్షలు ప్రారంభం**

**రాయవరం:** చదువుల యజ్ఞంలో మైలురాయిగా నిలిచే పదో తరగతి పరీక్షలు సోమవారం మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో మొదలయ్యాయి. రాయవరంలోని శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల, చెల్లూరు, పసలపూడి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాయవరం జెడ్పీహెచ్ఎస్–ఎ పరీక్షా కేంద్రంలో 165, జెడ్పీహెచ్ఎస్–బీ కేంద్రంలో 199, పసలపూడి జెడ్పీహెచ్ఎస్ 135, చెల్లూరు జెడ్పీహెచ్ఎస్‌లో 156 మంది విద్యార్థులను కేటాయించారు. మొత్తం 655 మంది విద్యార్థులకు పసలపూడి, చెల్లూరు పరీక్షా కేంద్రం నుంచి ఒక్కొక్కరు వంతున గైర్హాజరయ్యారు. రాయవరం –1, 2, చెల్లూరు, పసలపూడిల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా డి.సత్తిరాజు, పి.వెంకటేశ్వరరావు, పోలిశెట్టి రాంబాబు, వి.శాంతిసునీత, డీవోలుగా డి.జోసఫ్‌కుమార్, డి.త్రిమూర్తులు, ఆర్.శ్రీనివాసుస, ఏఎస్‌టీ వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

**రామచంద్రపురం రూరల్‌లో..**

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో హాజరు కావాల్సిన 1535 మంది విద్యార్థులకు గాను, 1516 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ సోమవారం విలేకరులకు తెలిపారు.

**కాజులూరు:** మండల గ్రామాల్లో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో కోలంక, కాజులూరు, గొల్లపాలెం కేంద్రాల్లో మొత్తం 685 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసి ఉండగా గొల్లపాలెం సెంటర్‌లో ఒక విద్యార్థి పరీక్షలకు గైర్హాజరయ్యాడు. కోలంక, కాజులూరు సెంటర్లలో నూరుశాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9 గంటల 30 నిమిషాలకు పరీక్ష ప్రారంభం కాగా దాదాపు అన్ని కేంద్రాల్లోనూ అర్ధగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారని విద్యార్థులకు తాగునీరు తదితర వసతులు ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ తెలిపారు.



మండపేటలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు



రాయవరంలో పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు సరిచూసుకుంటున్న విద్యార్థులు



రామచంద్రపురంలో హాల్ టికెట్ల ప్రకారం రూమ్‌లు చూసుకుంటున్న విద్యార్థులు

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

**టీడీపీ ఆరోపణలను ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు**

**కపిలేశ్వరపురం:** మండపేట నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్సీ తోటను విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. అంగరకు చెందిన టీడీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ ఇటీవల ఎమ్మెల్సీ తోటపై చేసిన విమర్శలను తామంతా ఖండిస్తున్నామన్నారు. అంగరలోని వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో సోమవారం జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట చేసిన అభివృద్ధి పనులను వివరించారు. నియోజకవర్గ పరిధిలోని గౌతమి గోదావరి గట్టును ప్రయాణాలకు అనుకూలంగా మెరుగుపర్చిన విషయాన్ని టీడీపీ నేతలు గుర్తించాలన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మండలంలోని ఇసుక ర్యాంపుల్లో ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన అవినీతిపై అప్పట్లో పత్రికల్లో కథనాలు వచ్చాయన్న విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు అవినీతి చర్యలను తట్టుకోలేక ప్రజలు గద్దె దింపేశారని, జన్మభూమి కమిటీలు పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్న తీరును ప్రజలు నేటికి మర్చిపోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మధ్యవర్తులు ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమం తాలూకు సొమ్మును లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాకు జమ చేస్తుందన్నారు. ఇంతటి పారదర్శకత గల ప్రభుత్వాన్ని, ఎమ్మెల్సీ తోటను విమర్శించడం వెనుక టీడీపీ నాయకుల అసమర్థతను తేటతెల్లం చేస్తుందన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు ఎమ్మెల్సీ తోటపై విమర్శలను మానుకోవాలని లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బుతో పాటు అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు తిరునాతి వెంకటేశ్వరావు, పసలపూడి శ్రీనివాస్, కవల రాజు, సలాది వీరబాబు మాట్లాడారు.



అంగర పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అబ్బు, తదితరులు

## భవిత కేంద్రానికి దాతల వితరణ

**కె.గంగవరం:** మండలంలోని కె.గంగవరంలోని భవితా కేంద్రం (ప్రత్యేక అవసరాలు కలిగిన వనరుల కేంద్రం)కు మన గంగవరం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామగ్రిని వితరణ చేశారు. ట్రస్ట్‌కు చెందిన రిమ్మపూడి సతీష్ ఎల్ఈడీ టీవీ, వైట్ల వీరరాఘవులు సీపీయూ, నాగేశ్వరరావు బల్లలు, పద్మజ స్టేషనరీను జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈఓ నాగరాజు సమక్షంలో భవితా కేంద్రం సిబ్బందికి అందించారు. భవితా కేంద్రంలో పిల్లలకు ఉన్న రవాణా సమస్యను భవితా కేంద్రం ఉపాధ్యాయులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తీసువెళ్లగా వెంటనే స్పందించి కొంత సొమ్మును గ్రామ పెద్దలు అందించారు. కార్యక్రమంలో వట్టికూటి రామ్‌ప్రసాద్, నేమాని ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు ఈదర రమేష్, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



భవితా కేంద్రానికి కంప్యూటర్, సీపీయూ తదితర సామగ్రిని అందించిన దృశ్యం

## క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన

**ఆలమూరు:** మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో కలవచర్ల, నవాబుపేట, పెనికేరు గ్రామాల్లో సోమవారం వైద్యారోగ్య సిబ్బంది క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధి నియంత్రణకు ఆధునిక వైద్య చికిత్స అందుబాటులో వచ్చినందున రోగగ్రస్తులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఏఎన్ఎంలు వి.రమణ, టి.సుశీల, కె.రాణి తదితరులు పాల్గొన్నారు.



పెనికేరులో క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

### జ్యోతిషరత్న అవార్డు స్వీకరణ

**ఆలమూరు:** మండలంలోని సంధిపూడికి చెందిన ఇలపర్తి వెంకటేష్ జ్యోతిషరత్న అవార్డు స్వీకరించారు. జ్యోతిష రంగంలో ఉన్న విశేష అనుభవాన్ని గుర్తించిన విజయవాడకు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ సోమవారం స్థానిక గోల్డెన్ వే హోటల్‌లో జ్యోతిష పండితుల చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మేడపాటి లక్ష్మణరావు తదితరులు అభినందించారు.

### వైభవంగా శ్రీపుష్పోత్సవం

**రామచంద్రపురం:** పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో వేంచేసిన సీతాసమేత కోదండ రామస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీపుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం దీనిని నిర్వహిస్తారు. కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పుష్పోత్సవం కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పోసింశెట్టి గణపతిరావు, ఝాన్సీలక్ష్మీశారదల చేతుల మీదుగా కొండూరి రామసుబ్రహ్మణ్య శర్మ, కొండూరి శ్రీనివాస శర్మల బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా శ్రీపుష్పోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు దంపతి తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి వైఎస్సార్ ఆసరా సమావేశాలు

**రాయవరం:** మండలంలోని నదురుబాద, వెదురుపాక, వి.సావరం, రాయవరం, లొల్ల, సోమేశ్వరం గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ ఆసరా సమావేశాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. నదురుబాదలో నూతన సచివాలయం, వెదురుపాక పంతులురెడ్డి కల్యాణ మండపం, వి.సావరం శివాలయం, రాయవరంలో రాజరాజేశ్వరికాలనీలోని పాఠశాల వద్ద, లొల్లలో శివాలయం వద్ద, సోమేశ్వరంలో ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాలను విజయవంతం చేయాలని ఎంపీపీ వెంకటరమణ మహిళా శక్తి సంఘాలకు పిలుపునిచ్చారు. ఇదిలా ఉంటే నదురుబాదలో 25, వెదురుపాక 112, వి.సావరం 75, రాయవరం 154, లొల్ల 23, సోమేశ్వరం198 మహిళా శక్తి సంఘాలకు వైఎస్సార్ ఆసరా వచ్చినట్టు ఎంపీడీవో శ్రీనివాసు తెలిపారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**రామచంద్రపురం:** రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది దుగ్గిరాల సుభాష్‌ను వన్ టౌన్ ఎస్సై నారాయణ, అతని సిబ్బంది అకారణంగా కొట్టి అడ్వకేట్‌ని అని చెబుతున్నా వినకుండా దుర్భాషలు ఆడుతూ విచక్షణారహితంగా గాయపరిచినందుకు నిరసనగా రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధుల బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి సాదే నారాయణరావు, కోశాధికారి నేలపాటి వీరభద్రరావు, వాడ్రేవు సాయిప్రసాద్, పోలిశెట్టి శ్రీనివాస్, వాకలపూడి జయశంకర్, దాసరి జగదీష్, చోడే జాన్‌రత్నం, కె.లోవరాజు, కముజు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురం బార్ అసోసియేషన్ భవనం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు